


శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త








## రీ సర్వేకు రైతులు తప్పక హాజరు కావాలి



**కోవూరు, ఫిబ్రవరి 14ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని పంచాయతీ పరిధిలో జరుగుతున్న భూముల రీ సర్వే కార్యక్రమానికి రైతులు తప్పనిసరిగా హాజరయ్యేలా తగు చొరవ తీసుకోవాలని సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ సత్యనారాయణ అన్నారు. కోవూరులోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం గ్రామ రెవెన్యూ అధికారులు, సర్వేయర్లతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ ప్రాంతంలో సర్వే చేస్తున్నామో మూడు రోజులు ముందుగానే ఆ ప్రాంత రైతులకు తెలియజేసి వారందరూ రీ సర్వే కార్యక్రమానికి హాజరయ్యేలా చూడాలన్నారు. రైతులు ఏమైనా సమస్యలు తీసుకువస్తే.. వాటిని పరిష్కరించేలా చూడాలన్నారు. ఈ రీ సర్వే కార్యక్రమాన్ని రైతులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని తమకున్న సమస్యలను ఇందులో పరిష్కరించుకోవాలన్నారు. గతంలో జరిగిన పొరపాట్లకు మరలా తావివ్వకుండా ఈ సర్వే కార్యక్రమాన్ని పారదర్శకంగా పూర్తిచేయాలన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నిర్మలానందబాబా, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ మధుసూదన్‌రావు, కోవూరు మండల ఇన్‌చార్జి సర్వేయర్ శ్రీనివాసులురెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎస్‌కే మునీజ్ అహ్మద్, తదితరులు ఉన్నారు.

## మాజీ ముఖ్యమంత్రికి ఘన నివాళులు



**కోవూరు, ఫిబ్రవరి 14ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేసి ఎన్నో వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన మాజీ ముఖ్యమంత్రి దామోదర్ సంజీవయ్యను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటాచలపతి గౌడ్ తెలిపారు. కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో మాజీ ముఖ్యమంత్రి దామోదర సంజీవయ్య 150వ జన్మదినం సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అటువంటి మహనీయుని నేటి యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు వంశీ కృష్ణ, డాక్టర్ గంగాధర్, డాక్టర్ జ్యోతిప్రభ, ఆరోగ్య సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకుంటున్నారు

– అధికారులు దృష్టి పెట్టాలి



**కోవూరు, ఫిబ్రవరి 14ప్రభాతవార్త :** కోవూరు మండలం గుమ్మలదిబ్బ కొత్త కాలనీలో తెలుగుదేశం పార్టీకి చెందిన పాశం మల్లికార్జున అనే వ్యక్తి ప్రభుత్వానికి సంబంధించిన వంద అంకణాల స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని, దీనిపై అధికారులు దృష్టి పెట్టాలంటూ ఆ ప్రాంత మహిళలు శుక్రవారం కోవూరు తహసీల్దార్ నిర్మలానందబాబాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాస్తవంగా మల్లికార్జునది ఈ ప్రాంతం కాదని, అతనికి ఆధార్, రేషన్ కార్డు నెల్లూరులో ఉన్నాయని, తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిందని, ఇక్కడికి వచ్చి ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుంటున్నారని, అడిగితే ప్రభుత్వం తమదని, తమను ఎవరు ఏం చేయలేరని ధీమా వ్యక్తం చేస్తున్నారన్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి ఈ ప్రభుత్వ స్థలంలో ఈ ప్రాంత చిన్నారులకు అవసరమైన అంగన్‌వాడీ కేంద్రం నిర్మించాలని ఈ ప్రాంత మహిళలు ఎంఆర్వోకు విన్నవించారు. ఇందుకు ఆయన స్పందించి వెంటనే ఆ ప్రాంతానికి సర్వేయర్, ఆర్ఐ, వీఆర్వోను పంపించి పూర్తిస్థాయిలో నివేదికను తెప్పించుకుంటామన్నారు. ఎవరైనా ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే సహించేది లేదని, అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## సాంకేతికత వైపు ముందడుగు



**కోవూరు, ఫిబ్రవరి 14ప్రభాతవార్త :** విజయవాడలోని సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ సెంటర్‌ను శుక్రవారం ఆంధ్రప్రదేశ్ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఇన్స్టిట్యూట్‌లో జరుగుతున్న ప్రాముఖ్యత కలిగిన పరిశోధనలు, పరిశ్రమలతో ఉన్న అనుబంధం, విద్యార్థులకు అందుతున్న సాంకేతిక ప్రావీణ్యంపై సంబంధిత శాఖ అధికారులతో ప్రత్యేకంగా సమీక్షించారు. సీపీఈటీలో పరిశ్రమల అభివృద్ధిలో అనుసరిస్తున్న ఆధునిక విధానాలను గమనించి ఈ రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని, ఈ సందర్భంగా వారికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఏపీఈఎంసీప జనరల్ మేనేజర్ వెంకటేశ్వర్లు, పీసీబీఎస్ఈ సుదర్శనం, ఇతర అధికారులు ఉన్నారు.

## లబ్ధిదారులు సహకరించాలి



**కోవూరు, ఫిబ్రవరి 14ప్రభాతవార్త :** కోవూరు మం డలంలోని నందలగుంట లే అవుట్‌లో ఆప్షన్–3 కింద శ్రీనివాస కన్‌స్ట్రక్షన్స్ ముందుకు వచ్చి అసం పూర్తిగా ఉన్న గృహాలను మొదలు పెడతారని, దీనికి లబ్ధిదారులు పూర్తిస్థాయిలో సహకరించాలని గృహ నిర్మాణ శాఖ డీఈ వెంకటేశ్వర్లురెడ్డి తెలిపా రు. ఈ మేరకు శుక్రవారం నందలగుంట లేఅవు ట్‌లో లబ్ధిదారులతో సమావేశమై వారికి పలు విషయాలపై అవగాహన కల్పించారు. మార్చి నెలాఖరులోగా అసంపూర్తిగా ఉన్న గృహాలను పూర్తి చేసేందుకు శ్రీనివాస కన్‌స్ట్రక్షన్స్ ముందుకు వచ్చారని దీనికి లబ్ధిదారులు సహకరించి నిర్మాణాలు వేగవంతం అయ్యేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ మాధవయ్య, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఇంజనీరింగ్ అసిస్టెం ట్లు ఉన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి



**కోవూరు, ఫిబ్రవరి 14ప్రభాతవార్త :** కోవూరు మండలం పడుగుపాడు రైల్వే స్టేషన్ పరిధిలో రైలు పట్టాలకు ఇవతల ప్రాంతంలో సుమారు 50 సంవత్సరాలు పైబడిన ఓ వృద్ధుడు మృతి చెంది ఉండడాన్ని శుక్రవారం కోవూరు ఎస్సై రంగనాథ్ గౌడ్ నిశిత పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మృతదేహాన్ని పరిశీలించి ఈ వ్యక్తి చనిపోయి సుమారు 10 రోజులు పైగా అయి ఉంటుందని, ఈ కారణంగా ఈ బాడీ మొత్తం డీ కంపోజ్ అయిందన్నారు. ఈ మేరకు శవపంచనామా చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఈ సందర్భంగా ఎస్సై తెలియజేశారు.

## అక్రమ నిర్మాణాలను గుర్తించి నోటీసులు జారీ చేయండి

## అదనపు కమిషనర్ వై.ఓ. నందన్




**నెల్లూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త :** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో అనధికార, అక్రమ నిర్మాణాలను గుర్తించి వాటి యజమానులకు నోటీసులు జారీ చేయాలని వార్డ్ సచివాలయ ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ కార్యదర్శులను కమిషనర్ వై.ఓ నందన్ ఆదేశించారు. వారాంతపు సమీక్షల్లో భాగంగా కార్పొరేషన్ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో శుక్రవారం పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఒక్క వార్డు ప్లానింగ్ కార్యదర్శి తమ లాగిన్లను రెగ్యులర్గా తనిఖీ చేసుకోవాలని సూచించారు. లాగిన్ లలో ఏలాంటి ఫైళ్ల పెండింగ్లో ఉంచుకోకుండా ఎప్పటికప్పుడు పరిష్కారానికై ఉన్నతాధికారులకు ఫార్వర్డ్ చేయాలని సూచించారు. సంబంధిత షార్ట్ ఫాల్స్‌ను ఉన్నతాధికారులకు తెలియజేసి క్లియర్ చేయించాలని తెలిపారు. అనధికార, అక్రమ నిర్మాణాలపై పి.ఓ, సి.ఓ నోటీసులను జారీ చేసి అవసరమైన పక్షంలో చార్జి షీట్లను దాఖలు చేయాలని సూచించారు. అనధికార లేఔట్లను గుర్తించి వాటి యజమానులకు నోటీసులు జారీ చేయాలని సూచించారు. వచ్చే బుధవారం ఎల్.ఆర్.ఎస్ పథకంపై మెగా మేళాను నిర్వహించనున్నారని, ప్రతి ఒక్క లేఔట్ యజమానికి సమావేశంపై అవగాహన కల్పించి హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో సి.పి హిమబిందు, డి.సి.పి. పద్మజ, ఏ.సి.పి.లు వేణు, ప్రకాష్, సర్వేయర్ సోమేశ్వర రావు, సూపెరెంటెండెంట్ పద్మ ,వార్డ్ ప్లానింగ్ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## షిరిడి సాయిబాబా మందిరంలో ప్రత్యేకాభిషేకాలు

**మనుబోలు ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** మనుబోలు గ్రామంలో శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు పూజలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఉభయకర్తలుగా నెల్లూరు జిల్లా మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కీర్తి శేషులు చిట్టుమూరు పద్మనాభరెడ్డి 9 వ వర్ధంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం కుమార్తె చెన్నై నగర వాస్తవ్యులు చిల్లకూరు నిర్మలమ్మ అద్దులు చెన్నై నగరంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ చిల్లకూరు ముద్దు కృష్ణారెడ్డి వీరి కుటుంబసభ్యులు వ్యవహరించారు. అర్చకులు శ్రీనివాసులు పూజలు నిర్వహించి భక్తులకు తీర్ద ప్రసాదాలు అందజేశారు. ఈకార్యక్రమంలో మాజీ జడ్‌పిటిసి వైసిపి బిసి సెల్ అద్యక్షులు దాసరి బాస్కర్ గౌడ్ మాట్లాడుతు వారి కుటుంబ సభ్యులు మండలంలో అనేక మంది పేద ప్రజలకు ఆర్దికంగా వైద్య పరంగా చేయూతనిచ్చి ఆదుకున్నారని వారి కుటుంబసభ్యులకు షిరిడి సాయిబాబా ఆశీస్సులు ఎల్లప్పుడు ఉండాలని పేద ప్రజలకు అండగా ఉండాలని కోరారు. ఈకార్యక్రమంలో ఉచ్చూరు దయాకర్‌రెడ్డి, కోసూరు సురేష్ గౌడ్, ఆడిపూడి రామకృష్ణారెడ్డి, మాచిరెడ్డి వెంకటరమణారెడ్డి, మరియు చిట్టమూరి కుటుంబ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



**కావలి, ఫిబ్రవరి14 ప్రభాతవార్త :** కావలి రూరల్ మండలం రుద్రకోట గ్రామానికి చెందిన పాలపర్తి భాస్కర్‌రావు, కోమలి దంపతుల కుమార్తె జ్యోత్స్న నలుగు కార్యక్రమంలో శుక్రవారం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఆయన వెంట టిడిపినేతలు పాల్గొన్నారు. **–కావలి పట్టణం అరటితోటలో...** కావలి పట్టణం 9వ వార్డు అరటితోటలో టిడిపి పార్టీకి చెందిన పసుపులేటి కృష్ణ, పద్మావతి దంపతుల కుమారుడు వెంకటరమణ నలుగు కార్యక్రమంలో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి పాల్గొని నూతన వరుడును ఆశీర్వదించారు.–చెన్నాయపాలెం పెద్దపట్టుపుపాలెం.కావలి రూరల్ మండలం చెన్నాయపాలెం పెద్దపట్టుపుపాలెం గ్రామానికి చెందిన తెలుగుదేశంపార్టీ కార్యకర్త పామంజి పార్వతయ్య, వనజ దంపతుల కుమార్తె పుష్పాలంకరణ వేడుకలో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఆ చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## యాకసిరి రమణయ్య భౌతికకాయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే



**కావలి, ఫిబ్రవరి14 ప్రభాతవార్త :** కావలి ముసునూరు మర్రిచెట్టు గిరిజనకాలనీలో టిడిపి కార్యకర్త యాకసిరి రమణయ్య అకాలమరణం చెందారు. ఈ విషయం తెలుసుకున్న కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి శుక్రవారం ఆయన నివాసానికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి పూలమాల ఉంచి నివాళులర్పించారు. కుటుం బసభ్యులను పరామర్శించారు. ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట టిడిపినేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్రీడలు ఒత్తిడి, నిరాశను తగ్గిస్తాయి కరస్పాండెంట్ దామిశెట్టి



**కావలి, ఫిబ్రవరి14 ప్రభాతవార్త :** క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కల్గిస్తూ ఒత్తిడిని, నిరాశలు తగ్గిస్తాయని డిబియస్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్‌నాయుడు తెలిపారు. కావలి డిబియస్ ఇంజనీరింగ్ కళాశాల లో ఫౌండేషన్ డే సందర్భంగా శుక్రవారం స్పోర్ట్స్ మీట్‌లో గెలుపొందిన విద్యార్థిని, విద్యార్థులకు బహుమతులు అందచేశారు. కళాశాల ఆవరణంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో దామిశెట్టి మాట్లాడారు. క్రీడలు మేథస్సును కూడా పెంపొందిస్తాయన్నారు. ఆటలు ఆడడం సమన్వయాన్ని పెంచుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వశిష్ఠ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ సురేంద్రరెడ్డి మాట్లాడుతూ తరచుగా క్రీడలు నిర్వహించాలన్నారు. క్రీడలు శారీరక శ్రమతోపాటు క్రీడా నైపుణ్యంకూడా పెంపొందించవచ్చునన్నారు. డిబియస్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టివి రావు మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులు క్రీడల్లో పాల్గొనాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జి.రమేష్‌బాబు, ఫిజికల్ డైరక్టర్ దాసరి శివసాగర్‌కుమార్, అసిస్టెంట్ ఫిజికల్ డైరక్టర్ పాలేటి మహేంద్రబాబు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఈ శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి



**కోవూరు, ఫిబ్రవరి 14ప్రభాతవార్త :** ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ శ్రమ్ పోర్టల్‌లో అసంఘటిత రంగ కార్మికులు ఉచిత నమోదు కార్యక్రమాన్ని చేసుకుంటే అది వారికి ఎంతగానో ఉపయోగకరమని కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ గౌస్ అహ్మద్ తెలిపారు. కోవూరులోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆయన ఎంపీడీవో శ్రీహరిరెడ్డితో ఈ శ్రమ్ పోర్టల్‌కు సంబంధించి పలు విషయాలను చర్చించారు. ఇందులో నమోదు చేసుకున్న కార్మికులకు 12 అంకెల గల గుర్తింపు కార్డు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్డు ఉంటేనే ప్రభుత్వం అందించే అన్ని రకాల సామాజిక భద్రతా పథకాలు, వివిధ సంక్షేమ పథకాలు వర్తిస్తాయన్నారు. ఈ పథకంలో చేరేందుకు 16 నుంచి 59 సంవత్సరాల లోపు మాత్రమే అర్హులన్నారు. ఇవి నమోదు చేసేందుకు ఈకేవైసీ కలిగిన ఆధార్, ఆధార్‌తో మొబైల్ నెంబర్ అనుసంధానం ఉంటే సరిపోతుందన్నారు. ఈ నమోదు కార్యక్రమాన్ని సచివాలయాల్లో గానీ, పోస్టాఫీస్‌లో గానీ నమోదు చేసుకోవచ్చన్నారు. నమోదు చేసుకున్న వెంటనే యూనివర్శిల్ ఐడీ నెంబర్ ఉన్న కార్డు వస్తుందన్నారు. ఈ నమోదు కార్యక్రమానికి ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఇందులో నమోదు చేసుకున్న సంవత్సరం పాటు ప్రధానమంత్రి సురక్షా భీమా యోజన పథకం కింద ప్రమాదంలో మరణించినా, అంగవైకల్యం కలిగినా రెండు లక్షల వరకు ప్రమాద బీమా వస్తుందన్నారు. ఇటువంటి మంచి అవకాశాన్ని అసంఘటిత రంగాల్లో పనిచేసున్న కార్మికులు పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలన్నారు.

## చిన్నారుల సమగ్రాభివృద్ధికి శిక్షణ ఉపయోగపడుతుంది



**కోవూరు, ఫిబ్రవరి 14ప్రభాతవార్త :** అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యనభ్యసించే చిన్నారుల సమగ్రాభివృద్ధికి ప్రస్తుతం అందిస్తున్న శిక్షణ పూర్తిస్థాయిలో ఉపయోగ పడుతుం దని సీడీపీవో జ్యోతి తెలిపారు. కోవూరు లోని జెబీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమావేశ మందిరంలో పోషణ్ బీ .. పడాయి బీ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు ఈ శిక్షణలో ఇచ్చిన అంశాలను పూర్తిస్థాయిలో అవగాహన చేసుకుని వారి యొక్క బోధన సామర్థ్యాలను పెంపొందించుకునేందుకు అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా ప్రభుత్వం అందించే పౌష్టికాహారంపై గర్భవతులకు, బాలింతలకు అవగాహన కల్పించి రక్తహీనత అనేది రాకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడమే కాకుండా చిన్నారులకు ఆట పాటలతో కూడిన విద్యను తప్పక అందించాలన్నారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక, వీడియో ద్వారా పలు విషయాలను అంగన్‌వాడీ కార్యకర్తలకు వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ప్రసూన, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.

## తాగునీటి సమస్యపై సచివాలయ సిబ్బందిని నిలదీసిన జెఆర్‌పేటవాసులు



**ఆత్మకూరు, ఫిబ్రవరి14, ప్రభాతవార్త:** ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని 4వ వార్డు జెఆర్‌పేట వాసులు తాము తాగునీటి సమస్యతో నానా ఇబ్బందులు పడుతు న్నామని సచివాలయ సిబ్బందిని శుక్రవారం నిలదీశారు. పట్టణంలోని జెఆర్‌పేటలోని మేదర స్కూల్ లైన్ లో తాగునీరు విడుదల సరిగా లేదని ఆరోపిస్తూ మున్సిపాల్టీ సిబ్బందిని ఈప్రాంత ప్రజలు నిలదీశారు. తమ ప్రాంతంలో నీరు సరిగా వదలడం లేదని వారు సిబ్బందిని నిలదీశారు. తమ సమస్యను పరిష్కరించాలంటూ మున్సిపల్ కమీషనర్‌కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. తమ తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని వారు కోరారు. ఇప్పుడే ఇలా ఉంటే వేసవికాలంలో తమ పరిస్థితి ఏమిటంటూ వారు ఆవేదన వ్యక్తం చేశారు.

## మంచానికే పరిమితమైన శ్రీనివాసులుకు హ్యాపీసేవాసంస్థ చేయూత



**కావలిరూరల్, ఫిబ్రవరి14 ప్రభాతవార్త :** గత ఎనిమిది సంవత్సరాలుగా మంచానికే పరిమితమైన గోచిపాతల శ్రీనివాసులు అనే దివ్యాంగుడికి హ్యాపీసేవాసంస్థ ఆధ్వర్యంలో సంస్థ సభ్యులు శుక్రవారం ఎయిర్‌బెడ్‌తోపాటు ఎయిర్ మిషన్‌ను అందించడం జరిగింది. ఈ సందర్భంగా హ్యాపీ సేవాసంస్థ గౌరవ అద్యక్షులు ఖాదర్‌బాష మాట్లాడారు. కావలి పట్టణంలోని 18వ వార్డులో నివాసముంటున్న గోచిపాతల శ్రీనివాసులు గత ఎనిమిది సంవత్సరాలుగా రోడ్డుప్రమాదంలో రెండుకాళ్లు కోల్పోయి మంచానికే పరిమితమైనారని తెలియచేశారు. హ్యాపీసేవాసంస్థ అద్యక్షులు సయ్యద్ ఘనీబాష దృష్టికి తీసుకువెళ్లగా శ్రీనివాసులుకు ఎయిర్‌బెడ్ అవసరం అని తెలియచేసిన వెంటనే స్పందించి సంస్థ సలహాదారులు చేవూరు ప్రభయ్య దాతృత్వంతో బెడ్‌ను, ఎయిర్‌మిషన్‌ను ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. హ్యాపీసేవాసంస్థ ద్వారా సేవలందిస్తున్న సంస్థ అద్యక్షులు సయ్యద్ ఘనీబాషకు అభినందనలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో హ్యాపీసేవాసంస్థ అద్యక్షులు సయ్యద్ ఘనీబాష, సలహాదారులు చేవూరు ప్రభయ్య, ఉపాధ్యక్షులు దేవరకొండ విజయ్, రత్నమ్మ చారిటబుల్‌ట్రస్ట్ వ్యవస్థాపకులు ఎంవియన్ ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

## వెయ్యి రోజులు తల్లి బిడ్డ తీసుకునే ఆహారం గురించి శిక్షణ






**బుచ్చి ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం నగరపాలక పంచాయితీలోని డిఎల్ఎన్ఆర్ హైస్కూల్‌లో సూపర్ వైజర్లు వి.శంకుతల, కె. ఉమా నేతృత్వంలో అంగన్‌వాడీ భీ– పడాయి భీ శిక్షణా తరుగతులు 2 రోజు కూడా నిర్వహించారు. ఈకార్యక్రమంలో సిడిపిఒ జ్యోతి అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతుపోషకాహార లోపం, నిర్వహణ, సూక్ష్మ పోషకలోపాలు, చికిత్స, నవజాత శిశువుకు తీసుకోవల్సినజాగ్రత్తలు వీడియా రూపంలో చూపించారు. 1000 రోజులు తల్లి బిడ్డ తీసుకోవల్సిన అహారం గురించి వివరించారు. పోషకాహార లోపం రాకుండా ఉండాలంటే కౌమార దశ నుండి పోషకాహార తీసుకోవాలని, గర్భవతి, బాలింతలు, పిల్లలు, తీసుకోవాల్సిన అహారం గురించి పిల్లల యొక్క పోషణ స్థితి తెలియాలంటే ప్రతి నెల అంగన్‌వాడీ సెంటర్‌లో ,బరువు, ఎత్తు సక్రమంగా తీయాలని, సూక్ష్మ పోషక లోపాల గురించి ఐరన్, విటమిన్–ఏ, అయోడిన్, విటమిన్–డి ,క్యాలిషయం లోపం నివారణకు తీసుకోవల్సిన అహారం జాగ్రత్తలు ఆమె వివరించారు. పోషకాహారం తల్లులు ఏలా ఇవ్వాల అన్న విషయం గురించి రోల్‌ప్లే చేయడం జరిగింది. తల్లిపాల ప్రాముఖ్యత, పోతపాలు వలన కలుగు నష్టాల గురించి, వ్యక్తిగత శుభ్రత, మరియు పారిశుద్యం, చేతులు శుభ్రం చేసుకునే విషయం గురించి చెప్పడం జరిగింది. ఎంసిపి కార్డు గురించి, ఇసిసిలో తల్లుదండ్రులు మరియు, సమాజం యొక్క సపోర్టు ఉండడం ద్వారా పిల్లల అభివృద్ధి మెరుగు పడుతుందని పిల్లల భద్రత ,దత్తత గురించి వివరించడం జరిగింది. ఈకార్యక్రమంలో అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## నవజాత శిశువులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణ



**మనుబోలు ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** మండలకేంద్రమైన మనుబోలులోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలోజరిగిన అంగన్‌వాడీ కార్యకర్తల శిక్షణా కార్యక్రమంలో భాగంగా నవజాత శిశువులు తీసుకో వాల్సినజాగ్రత్తలు మరియు గర్భవతులు బాలింతలు తీసుకోవాల్సిన ఆహారం అలవాట్ల గురించి తెలియ జేయడం జరిగింది. 0–3 సంవత్సరాలలోపు పిల్లలు తల్లులకు నవ చేతన గురించి అనగా వయస్సుకు తగ్గ ఎత్తు మరియు వయస్సుకు తగ్గ బరువు లేకపోవడం పిల్లలు పుట్టినప్పటి నుండి పిల్లల యొక్క ఎదు గుదల గురించి అంగన్‌వాడీ టీచర్స్‌కు శిక్షణ ఇవ్వడం జరిగింది. అంతే కాకుండా బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వసంతకుమారి న్యూట్రిషన్ గురించి అంగన్‌వాడీ టీచర్స్‌కు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు సిహెచ్ రమణమ్మ, బి పద్మజా, సిహెచ్ ఆది నారాయణమ్మ, అంగన్‌వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

## సంయుక్త సేవాసంస్థ చేస్తున్న సేవలకు 30వేలు విరాళం



**కావలిరూరల్, ఫిబ్రవరి14 ప్రభాతవార్త :** కావలి పట్టణ నివాసులు వృత్తిరీత్యా విదేశాలలో ఉన్న ఒట్టూరు సుధాకర్, చిత్రకల్పన దంపతుల కుమారుడు ఒట్టూరు సుచిర్ జ్ఞాపకార్థంగా సంయుక్త సేవాసంస్థ చేస్తున్న సేవలకు శుక్రవారం 30వేల రూపాయల విరాళం అందచేయడం జరిగింది. అనంతరం బుడమగుంట గిరిజన కాలనీలోని పేదలకు అన్నదానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నెల్లూరు పంచాయితిరాజ్‌శాఖ డీఈ ఒట్టూరు రమేష్, విశ్రాంత సబ్‌ట్రెజరి అధికారి ఆత్మకూరి కల్లయ్యలు మాట్లాడారు. బుడమగుంట గిరిజనకాలనీలోని పేదలందరూ తమయొక్క పిల్లలను బడికి పంపించాలని తెలియచేశారు. పిల్లలను నిరక్షరాశ్యులుగా చేయవద్దని చదువుకుంటే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని తెలియచేశారు. మీ పిల్లలకు మంచి భవిష్యత్తునివ్వాలని తెలిపారు. ఒట్టూరు సుచిర్ ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. ఈ కార్యక్రమంలో దాత ఒట్టూరు చిత్రకల్పన, వారి కుటుంబసభ్యులు విజయలక్ష్మి, జయచందు, రవీంద్ర, లక్ష్మిరాజ్యం, ఝాన్సి, రాధిక, ఓ.సుచిత్, గణేష్, వెంకటసాయి, చరణ్, సంస్థ వ్యవస్థాపక అద్యక్షులు గంగపట్నం సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రబడ్జెట్‌పై నిరసనలకు వామపక్షపార్టీలు పిలుపు



**కావలి, ఫిబ్రవరి14 ప్రభాతవార్త :** కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై నిరసనలు వ్యక్తంచేస్తూ పోరాటాలు కొనసాగిస్తామని ప్రజలు కలిసిరావాలని వామపక్షపార్టీల నేతలు పిలుపునిచ్చారు. కావలి సిపిఎం పార్టీ కార్యాలయంలో వామపక్షపార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సిపిఎం నేత పసుపులేటి పెంచలయ్య అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిధిగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు మాదాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాదాల వెంకటేశ్వర్లు మాట్లాడారు. కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతులకు, కార్మికులకు, శ్రామికులకు ఉపయోగపడే బడ్జెట్ కాదన్నారు. ముఖ్యంగా విద్య, వైద్యంకొరకు ఎక్కడా ప్రస్తావించలేదన్నారు. గ్రామీణ ఉపాధిహామీ పథకానికి తగిన నిధులు కేటాయించలేదన్నారు. రైతులు పండించిన పంటలకు సమగ్రచట్టం చేయలేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేసేందుకు పరుగులు తీస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రావల్సిన విభజన హామీలు నెరవేరలేదన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటికరణ చేసేదిలేదని ఎక్కడా హామీ ఇవ్వలేదన్నారు. ఈ బడ్జెట్ ఆదాని, అంబాని వంటి బడా పెట్టుబడుదారులకు రాయితీలు చేకూర్చేవిధంగా ఉందన్నారు. ఈ బడ్జెట్ శ్రామికవర్గానికి పొట్టకొట్టేవిధంగా ఉందన్నారు. ఇప్పటికే అధికధరలు, కరెంటుచార్జీలు, రకరకాల యూజర్ చార్జీలతో ప్రజలు ఆర్థికిబ్బందుల్లో ఉన్నారన్నారు. ప్రభుత్వాలు ప్రజల ఆర్థికపరిస్థితులు మెరుగుపర్చేవిధంగా బడ్జెట్ ఉండాలన్నారు. పెట్టుబడిదారులకు లాభాలు చేకూర్చేవిధంగా ఉండడం చాలా దుర్మార్గమన్నారు. బడ్జెట్‌తో సవరణ చేయాలన్నారు. ప్రజలకు, శ్రామికులకు, రైతులకు ఈ బడ్జెట్ ఉపయోగపడేలా ఉండాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ నాయకులు బలిజేపల్లి వెంకటేశ్వర్లు, సిపిఐఎంఎల్ నాయకులు ఎల్.లక్ష్మిరెడ్డి, పిడియస్‌యు మాజీ రాష్ట్రనేత కరవది భాస్కర్, స్త్రీ విముక్తి సంఘటన జిల్లా నాయకురాలు ఎల్.శ్యామలమ్మ, తదితరులు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి.మధుసూధన్‌రావు, సిఐటియు నాయకులు వై.కృష్ణమోహన్, సిపిఐ నాయకులు కె.నాగరాజు, దర్గాబాబు, రావికోటిరెడ్డి, డివైఎఫ్‌వై, వ్యవసాయకార్మికసంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జల జీవన్ పనుల్లో సాంకేతిక లోపం



**బిట్రగుంట ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: :** బోగోలు మేజర్ పంచాయతీలో తాగునీటి సరఫరాలో జాప్యాన్ని నివారించి తాగునీరు అందిస్తామని ఆర్డబ్ల్యూఎస్ డీఈ లీలాప్రకాష్ చెప్పారు. మేజర్ పంచాయతీలో ఓవర్ హెడ్ ఏ ట్యాంక్ ఏర్పాటై 40 సంవత్సరాలు కావడంతో అప్పటి పైపులు స్థానం లో కొత్త వాటిని అమర్చేందుకు జల జీవన్ మిషన్ కింద 60 లక్షల రూపాయలు నిధులు మంజూరయ్యాయి. ప్రస్తుతంవీటిని ఏర్పాటుచేస్తున్నారు. పలు సాంకేతిక కారణాల వల్ల పనులు మందకొడిగా సాగడంతో గత నాలుగు రోజుల నుండి పంచాయతీలో తాగునీటి సరఫరా లో అంతరాయం ఏర్పడింది ఈ విషయమై ప్రజలు ఫిర్యాదు చేయడంతో ఆర్‌డబ్ల్యూఎస్ డిఈ లీలాప్రకాష్ పైపులైన్లు మార్చే చోట ఏర్పడ్డ అంతరాయాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాంకేతిక పరమైన లోపాలు అధికమించి త్వరితగతిన ప్రజలు ఇబ్బంది పడకుండా తాగునీరు అందిస్తామన్నారు. ఆయన వెంట ఎంపీడీవో సుబ్రహ్మణ్యం ఈవోపీఆర్డి నాయుమ్ తాజహుస్సన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఈ శ్రీనివాసరావు పంచాయతీ కార్యదర్శి జహీర్ ఉన్నారు

## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించిన మంత్రి ఆనం

### ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలి
### సీఎం పర్యటనలో ఎటువంటి సమస్యలు తలెత్తకూడదు
### ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో మంత్రికి స్వాగతం పలికిన ఎమ్మెల్యే



**కందుకూరు, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడు పర్యటన ఏర్పాట్లు పరిశీలించుటకు కందుకూరు విచ్చేసిన రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు స్వాగతం పలికి శాలువాతో ఘనంగా సత్కరించారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా కందుకూరు పట్టణానికి విచ్చేయుచున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటనపై దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామానారాయణరెడ్డి కలెక్టర్ ఓ.ఆనంద్, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, ఒంగోలు ఎమ్మెల్యేదామచర్ల జనార్ధన్ సబ్ కలెక్టర్ ఆఫీసులో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం పర్యటనలో ఎటువంటి సమస్య తలెత్తకుండా అధికారులు, పోలీసులు సమన్వయంతో పని చేసి పర్యటన విజయవంతం చేయాలని సూచించారు. ముందుగా పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో సభా ప్రాంగణం వద్ద ఏర్పాట్లు పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని చూడాలని పోలీసు శాఖ వారికి సూచించారు. ముఖ్యమంత్రి హెలిప్యాడ్ ప్రాంతంలో దిగి, తిరిగి కార్యక్రమం పూర్తయి వెళ్లే వరకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేసి కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని మంత్రి తెలియజేశారు. కందుకూరు పట్టణంలోని శ్రీశ్రీశ్రీ అంకమ్మ తల్లి దేవాలయంలో అమ్మవారిని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దివి శివరాంతో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అధికారులు మంత్రికి ఆలయ నమూనాను, ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కృష్ణకాంత్, సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ, నెల్లూరు నగర కార్పొరేషన్ కమీషనర్ సూర్య తేజ, డీఎస్పీ బాల సుబ్రహ్మణ్యం, మున్సిపల్ కమీషనర్ కే.అనూష, ఇతర శాఖ ఉన్నతాధికారులు, పట్టణ పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు నార్నె రోశయ్య, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## జడ్పీలో ఘనంగా సంజీవయ్య జయంతి వేడుకలు



నెల్లూరు, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త – కలెక్టరేట్ జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ, డిప్యూటీ సీఈవో కలిసి జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో తొలి దళిత ముఖ్యమంత్రిగా ఎన్నో ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ఆద్యుడిగా, పరిపాలనా దక్షుడిగా పేరు పొందిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించడం జరిగింది. ఇలాంటి మహనీయులను మనమందరము ఆదర్శంగా తీసుకొని మనవంతు కర్తవ్యంగా ఈ దేశ సంరక్షణకు అభ్యున్నతికి పాల్పడాలని జడ్పీ చైర్ పర్సన్ అనం అరుణమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా డిఆర్డిఏలో సంజీవయ్య జయంతి వేడుకలు



నెల్లూరు, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త – కలెక్టరేట్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా జిల్లా డిఆర్‌డిఏ కార్యాలయంలో సంజీవయ్య చిత్రపటానికి డిఆర్డిఏ పిడి నాగరాజు కుమారి పూలమాల వేసి నివాళులు అర్పించారు. 1921న ఫిబ్రవరి 14 జన్మించిన దామోదరం సంజీవయ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెండవ ముఖ్యమంత్రిగా తొలి దళిత ముఖ్యమంత్రిగా, కేంద్ర ప్రభుత్వాల్లో అనేక సార్లు మంత్రి పదవిని నిర్వహించారని రెండుసార్లు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా ఈయన ప్రత్యేకతల్లో ఇటువంటివి ఎన్నో ఉన్నాయని డిఆర్‌డిపిడి నాగరాజు కుమారి సందర్భంగా తెలియజేశారు. డిఆర్డిఏ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మంత్రి ఆనంకు ఎమ్మెల్యే ఇంటూరి ఆత్మీయ సత్కారం



**కందుకూరు, ఫిబ్రవరి14, ప్రభాతవార్త** సీఎంఫో గ్రాం సందర్భంగా దేవాదాయ ధర్మాదాయశాఖ మంత్రి ఆనంరామనారాయణరెడ్డి కందుకూరువిచ్చేసిన సందర్భంగా వారిని సాదరంగా ఆహ్వానించి శాలువాతో సన్మానించిన కందుకూరు ఎమ్మె ల్యే ఇంటూరి నాగేశ్వరరావు.

## దామోదరం సంజీవయ్య జీవితం మార్గదర్శినియం

### ఘన నివాళులు అర్పించిన జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్



నెల్లూరు క్రైమ్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త : ఒక సామాన్య కుటుంబంలో పుట్టి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెండవ ముఖ్యమంత్రిగా ఎదిగిన దామోదరం సంజీవయ్య జీవన విధానం ప్రతి ఒక్కరికి మార్గదర్శనీయమని జిల్లా ఎస్పీ జి కృష్ణ కాంత్ పేర్కొన్నారు. దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఎస్పీ నమస్సుమాంజలు ఘటించారు. సంయుక్త మద్రాసు రాష్ట్రముతో పాటు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో, కేంద్ర ప్రభుత్వములో అనేక మార్లు మంత్రి పదవులను నిర్వహించారని, 38 ఏళ్ళ పిన్న వయసులో ముఖ్యమంత్రి అయిన ఘనత ఈయనకే దక్కిందన్నారు.




## అక్రమ ఆస్తులు ఉంటే నిరూపించు



- నా అల్లుడు కుటుంబమే నాకు ఆర్థిక అండ
- నా కూతురికి విల్లా కొనిచ్చానని అని చెప్పడం హాస్యాస్పదం
- ఇతర దేశాలలో ఆస్తులు ఉన్నాయని చెప్పడం
- అల్లుడికి 57 ఎకరాలు దారాదత్తం
- నిజమే మాట్లాడని నిబద్దత గల వ్యక్తి కాకాణి
- నిజం చెబుతాడని ఎదురుచూస్తున్న
- రూ.4వందల కోట్లు లెక్కలు చెప్తున్నగోవర్ధన్‌రెడ్డి
- నా స్నేహితుడు ఒక్క సారైనా నిజం చెబుతాడని ఆశతో ఉన్నా..?

**నెల్లూరు, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త-వైద్యం** గతంలో నాకు సింగపూర్ మలేషియా హాంకాంగ్లో వేల కోట్ల రూపాయల ఆస్తులు ఉన్నాయని ఆరోపించిన కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఇప్పటి వరకు వాటిని నిరూపించలేకపోగా మరలా నేడు హైదరాబాద్, నెల్లూరు, బెంగుళూరులో రూ.4వందల కోట్ల పై చిలుకు ఆస్తులు ఉన్నాయని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మరో కొత్త డ్రామాకి తెర తీశాడని తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ధ్వజమెత్తాడు. కృష్ణపట్నం పోర్టు స్టేషన్‌లో 2021లో నమోదైన కేసుకు సంబందించి ముద్దాయిగా శుక్రవారం నగరంలో ఉన్న నెల్లూరు రైల్వే కోర్టులో హాజరైన సందర్భంగా మీడియాతో సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడాడు. కాకాణి గోవర్ధన్‌రెడ్డి పుణ్యమా అని ఈ రోజు నెల్లూరు కోర్టులో ముద్దాయిగా నిలబడ్డానని, కృష్ణపట్నం ఆనందయ్య ఆయుర్వేదం మందు విషయంలో నాపై బనాయించిన అక్రమ కేసు విషయంలో కోర్టుకు హాజరవ్వాల్సి వచ్చిందన్నారు. ఇలాంటివి చాలా కేసులున్నాయి. ఇంకా ఎన్ని వాయిదాలకు హాజరుకావాల్సి ఉంటుందో లేదో తెలియదు అన్నాడు. నా స్నేహితుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి నెల్లూరులో ఆఫీసు కొనేశానని, బెంగుళూరులో విల్లా కొన్నానని, హైదరాబాద్‌లో నా కుమార్తెకు విల్లా కొనిచ్చానని ఆరోపించడం జరిగిందన్నారు. తొమ్మిదేళ్లవుతున్నా ఇంకా వాటిని చూపించకపోగా, మరలా ఇప్పుడు నెల్లూరు హైదరాబాద్, బెంగుళూరులు అంటున్నాడని మండిపడ్డాడు. నా అల్లుడు నేను ఆస్తులు కొనిస్తే తీసుకునే రేంజ్‌లో లేడని, 60 ఏళ్ల క్రితమే వారిది కాంట్రాక్టర్ల కుటుంబమని , నా అల్లుడే కాదు.. ఆయన తండ్రి, తాతలు కూడా కాంట్రాక్టర్లే, శ్రీశైలం ప్రాజెక్టుతో పాటు షార్‌లోనూ ఎన్నో కాంట్రాక్టు పనులు చేసిన చరిత్ర వారిదని ఆయన వెల్లడించారు. పలు రాష్ట్రాల్లో కాంట్రాక్టు పనులు చేస్తున్న మా అల్లుడి కుటుంబమే నాకు, నా కుమారుడికి అండగా ఉంటూ వస్తోందని, నా రాజకీయ ఖర్చులకు అండగా నిలిచేది నా అల్లుడేనని, వారికి నేను విల్లా కొనిచ్చానని కాకాణి చెప్పడం హాస్యాస్పదమన్నారు. ఒక్క సారైనా నా స్నేహితుడు గోవర్ధన్‌రెడ్డి నోటీ నుంచి నిజం వినాలని ఎదురుచూస్తున్నాను, కానీ నాకు ఆ అవకాశం దక్కడం లేదన్నారు. నా స్నేహితుడు వర్మ కుమారుడికి చెందిన భవనంలో వేదాయపాలెం ఆఫీసు నిర్వహిస్తున్నానని, నా కుమారుడు బెంగుళూరులో అద్దె ఇంట్లో ఉన్నాడని సోమిరెడ్డివివరించారు. గత ఏడాది మార్చిలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చే విషయం తెలుసుకుని ఒక్క రోజు ముందు బినామి కంపెనీకి 57 ఎకరాలు అప్పగించినవిషయం వాస్తవం కాదా అని గోవర్ధన్‌రెడ్డిని సోమిరెడ్డి సూటిగా ప్రశ్నించారు. అక్కడ మార్కెట్ విలువ ఎకరా రూ.కోటి నుండి రూ.1.25 కోట్లు ఉన్న మాట వాస్తవం కాదులేదో నిరూపించాలన్నారు. మార్చి 15న అర్ధరాత్రి జీకేఎస్ కంపెనీకి భూమి అప్పగిస్తూ జీవో విడుదలైన తర్వాత కాకాణి గోవర్ధన్‌రెడ్డి అల్లుడు అప్పటికప్పుడు సీఈఓగా ఆ కంపెనీలో చేరిన విషయం వాస్తవం కాదా అని చంద్రమోహన్‌రెడ్డి నిలదీశాడు. ప్రభుత్వం భూమిని కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం, నెల్లూరులో ఏపీఐఐసీ అధికారులు ప్రొసిడింగ్స్ ఇవ్వడం, అల్లుడు సీఈఓగా చేరడం, ఇవ్వన్నీ మార్చి 15 వ తేదీన జరిగిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించాడు. ఎకరా రూ.15 లక్షలు చొప్పున కొట్టేసి 2016లో ఏదో జరిగిందని కబుర్లు చెప్పుకుంటూ వస్తున్నాడని ఆరోపించారు. 2016లోనే ఆ భూముల విషయమై నా వద్దకు వచ్చిన టీడీపీ సానుభూతి పరులైన రైతులను మందలించానని తెలిపారు. జిల్లా కలెక్టర్‌గా జానకి ఉన్న సమయంలోనే కృష్ణపట్నం ఉప్పు కయ్యలకు ఎకరా రూ.15 లక్షలు పరిహారం రాయించానని, అంతకు ముందే పోర్టు, రిలయన్స భూములకు రూ.7లక్షల పరిహారం ఇప్పించానని సోమిరెడ్డి గుర్తు చేశారు. హైవే పక్కన ఉండే రామదాసుకండ్రిక భూములకు రూ.6లక్షల చొప్పున ఎలా అడ్వాన్స్ తీసుకుంటారని ప్రశ్నించాను. అప్పుడే వెనక్కి ఇచ్చేయమని కూడా సూచించానని తెలియజేశాడు. 2016లో నేను రామదాసుకండ్రిగ భూములను కొట్టేసే ప్రయత్నం చేశానని నా బ్రో కాకమ్మ కథలు చెబుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశాడు. 2017 నుంచి 2019 వరకు మంత్రిగా ఉన్నాను. కాకాణిలా కొట్టేయాలనుకుంటే అప్పుడే ఆ ప్రయత్నం చేయాలి కదా నాకు, నా కుటుంబానికి ఎప్పుడూ ఆ అలవాట్లు లేవు. కోట్ల రూపాయల విలువ చేసే మా ఆస్తులను స్కూళ్లు, ఆసుపత్రికి ఇచ్చిన చరిత్ర మాదన్నారు. వావిలేటిపాడులో కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆక్రమించిన రూ.25 కోట్ల విలువైన భూములను కబ్జా చెర నుంచి విడిపించి దళితులకు అప్పగించిన విషయం మరిచిపోవద్దన్నారు. అదే వావిలేటిపాడులో విశ్రాంత ఉద్యోగుల ప్లాట్లు ఆక్రమించి ఈ రోజుకి కోర్టుల చుట్టూ తిరుగుతున్నాడన్నారు. మరో 80 సెంట్ల భూమి స్మశానంలో ఉందని, దానిని దళితుల భూమిలో నుంచి తమ కుటుంబానికి తీసివ్వాలని మంత్రిగా 2023లో అధికారులను పురమాయించిన చరిత్ర కాకాణిది ఇలాంటి బతుకులు మేం ఎప్పుడు బతకలేదన్నారు. మా పెదనాయన ఆదినారాయణరెడ్డి స్వాతంత్ర్య పోరాటంలో జైలుకెళ్లి వస్తే ప్రభుత్వం ఐదు ఎకరాల భూమి ఇచ్చింది. కోట్ల విలువ చేసే ఆ భూమిలో ఈ రోజు పేదలు ఆనందంగా నివసిస్తున్నారని, అల్లీపురం హైస్కూల్‌కు మా తండ్రి సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పేరుతో 2.50 ఎకరాలు కొనుగోలు చేసి ఇచ్చాం. ఈ రోజు అక్కడ ఎకరా విలువ ఆరేడు కోట్ల రూపాయలు, పక్కనే మరో అర ఎకరా భూమిని అల్లీపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఇచ్చానని సోమిరెడ్డి గుర్తు చేశారు. నవలాకులతోటలో మైపాడు రోడ్డు పక్కనే మరో హైస్కూల్ నిర్మాణానికి ఎకరా స్థలం అప్పగించామన్నారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రత్యేక రక్త పరీక్షలు చేయించుకుని నిజాలు మాట్లాడేందుకు మందులు వాడాలని సూచించాడు. ఈ రోజుకి సుప్రీం కోర్టు బెయిల్‌పై తిరుగుతూ నాపైనా, నా కుటుంబంపైనా సిగ్గుశరం లేకుండా నోటికొచ్చిన మాటలు మాట్లాడుతున్నాడు, నేనెప్పుడు గోవర్ధన్‌రెడ్డి బిడ్డలు బాగుండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఇప్పుడు నా బిడ్డల గురించి మాట్లాడాడు కాబట్టి కొన్ని అంశాలు ప్రస్తావిస్తున్నాను. 2019 , 2024 ఎన్నికల్లో కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె ఆయనకు డమ్మీగా నామినేషన్ దాఖలు చేశారు. మొదటి ఎన్నికలకు రెండో ఎన్నికలకు మధ్య కాలంలో కాకాణి కుమార్తె ఎన్ని ఆస్తులు కొనుగోలు చేశారో ఎలక్షన్ అఫిడవిట్‌లో స్పష్టం పేర్కొన్నారు. ఆస్తుల విషయంలో రెండో కుమార్తె కూడా సమానమే కదా కాకాణి గోవర్ధన్‌రెడ్డి బిడ్డలు మాత్రం వందల ఎకరాలు కొనుగోలు చేయాలి. ఆస్తులు పెంచుకోవాలి, అర్ధరాత్రి 57 ఎకరాలు పొందిన కంపెనీకి అల్లుడు సీఈఓ అయిపోవాలి, రూ.9 కోట్లు ట్రాన్స ఫర్ చేయాలి, మేం మాత్రం పెద్దోళ్ళు ఇచ్చిన ఆస్తులు, సినిమా హాళ్లు అమ్ముకోవాలని, 1947 లో స్వాతంత్ర్యం ముందే మా కుటుంబానికి ఇంపోర్టెడ్ కారు ఉంది. అప్పుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుటుంబ ఆస్తుల పరిస్థితి ఏందో తోడేరు ప్రజలకే తెలియాలన్నారు. 1962లో నెల్లూరులో సినిమా హాల్ ఓపెన్ చేశాం. 1968లో అల్లీపురంలో ఇల్లు కట్టుకున్నాం. ఈ రోజుకి అదే ఇంట్లో ఉన్నాం, అక్రమంగా ఆస్తులు పోగేసుకున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డికి నా గురించి, నా కుటుంబ సభ్యుల గురించి మాట్లాడే అర్హత ఎక్కడిది, ఈదూరులో 1.58 ఎకరాల భూమిని జగనన్న కాలనీకి సేకరించారు. అక్కడ బేసిక్ వాల్యూ ఎకరా రూ.6లక్షలు. కానీ ఎకరాకు రూ.22 లక్షలు తీసుకున్నారు. పైనాపురంలోనూ 1.30 ఎకరాలు తీసుకున్నారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డి అక్రమ ఆర్జన దుర్బుద్ధికి అడ్డు అదుపు లేకుండా పోయింది. గిరిజనుల జీవితాలను కూడా తాకట్టు పెట్టే స్థాయికి దిగజారుడు మళ్లీ సిగ్గు శరం లేకుండా నా కుటుంబాన్ని తిట్టడమే పనిగా పెట్టుకున్నాడని ఆగ్రహాన్ని వ్యక్తం చేశాడు. ఐదేళ్లు అధికారంలో ఉన్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చే ముందు రోజు ఎవడబ్బ సొత్తని అల్లుడికి 57 ఎకరాలు దారాదత్తం చేశాడు. ఇలాంటి వ్యక్తులు ఈ రోజు నన్ను అక్రమ కేసులు ముద్దాయిగా మార్చి కోర్టుల చుట్టూ తిప్పుతున్నాడని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు.

## ప్రాణదాత చిత్రపటానికి నివాళి అర్పించిన చంద్రశేఖర్ రెడ్డి



**నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త** ఇటీవల రోడ్డు ప్రమాదంలో బ్రెయిన్ డెడ్ అయ్యి తన అవయవదానంతో 6 మందికి ప్రాణ దానం చేసి మరణించిన డాక్టర్ భూమిక చిత్రపటానికి ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి నివాళులర్పించారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి యువ డాక్టర్ కుమారి భూమిక హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్‌కి గురయ్యారు. ఎంబిబిఎస్ చివరి సంవత్సరంలో భాగంగా హౌస్ సర్జన్‌గా సేవలందిస్తున్న డాక్టర్ భూమిక కు బ్రెయిన్ డెడ్ కావడంతో అపస్మారక స్థితిలో ఉన్న కన్న కూతురిని తిరిగి దక్కించుకోవడం సాధ్యం కాదు అని తెలిసి దుఃఖ సాగరంలో ఉన్న ఆమె తల్లిదండ్రులు ఎమ్మెల్సీ కల్పలత రెడ్డి డాక్టర్ భూమికకు ఉన్న సేవా గుణం, ఆశయాలను గుర్తుకు తెచ్చుకొని ఆమె గుండె, ఊపిరితిత్తులు, రెండు కిడ్నీలు, లివర్, కళ్ళను దానం చేసేందుకు ముందుకొచ్చారు. చనిపోతూ కూడా 6 మంది ప్రాణాలు కాపాడిన డాక్టర్ భూమిక ప్రజల మనసులు, గుండెల్లో సజీవంగా నిలబడిందని చంద్రశేఖర్ రెడ్డి అభిప్రాయ పడ్డారు. ఒక్కోగానొక్క కూతురు మరణించే స్థితిలో ఉండడాన్ని చూస్తూ బరువెక్కిన హృదయంతో సైతం ఇంత పెద్ద నిర్ణయం తీసుకున్న డాక్టర్ భూమిక కుటుంబ సభ్యుల నిర్ణయం సమాజానికి స్ఫూర్తిని ఇస్తుంది. భూమిక మృతిని కుటుంబ సభ్యులు ఎవ్వరు ఇప్పటికి జీర్ణించుకోలేకపోతున్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగడ సానుభూతి తెలియజేశారు. ఆయనతోపాటు కృష్ణ, గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ కల్పలత రెడ్డి, ఉద్యోగ సంఘ నాయకులు కాకర్ల వెంకట్రాంరెడ్డి, ఉపాధ్యాయ సంఘ నాయకులు,ప్రైవేట్ స్కూల్స్ నేతల తో కలిసి డాక్టర్ భూమిక చిత్రపటానికి ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డినివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యం కల్పించాలని చంద్రశేఖర్ రెడ్డి ప్రార్థించారు.

## జాతీయ హాకీ పోటీలకు ఎంపికైన భాను ప్రకాష్ ను అభినందించిన అదనపు కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్,ఫిబ్రవరి 14 ,ప్రభా తవార్త:** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని సచివాలయ వార్డు ఎడ్యుకేషన్ , డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ కొత్తకోట భాను ప్రకాష్, ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ 2024-25 వ సంవత్సరానికి గాను వరుసగా మూడవసారి ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీసెస్ హాకీ జట్టుకు ఎంపికయ్యారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ వై ఓ నందన్ భాను ప్రకాష్ ను అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లో రాణించి నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ గౌరవాన్ని పెంపొందించాలని ఆకాంక్షించారు. క్రీడాకారుడు భాను ప్రకాష్ మాట్లాడుతూ మొదటిగా హర్యానాలోని కురుక్షేత్రా 2022 సంవత్సరంలో, ఒరిస్సా రాష్ట్రంలోని భువనేశ్వర్లో 2024 లో జరిగిన క్రీడలలో ఎంపికై జట్టు విజయానికి కృషి చేశానని తెలిపారు. అదేవిధంగా 2025 వ సంవత్సరం ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ కు జట్టులో స్థానం సంపాదించానని సంతోషం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కాకినాడ ఆస్ట్రోటఫ్ హాకీ గ్రౌండ్లో ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ మరియు కేంద్ర సివిల్ సర్వీసెస్ సంయుక్తంగా ఈనెల 15వ తేదీ నుండి 28వ తేదీ ఫిబ్రవరి 2025 వరకు నిర్వహించనున్నారని తెలిపారు.

## బుచ్చి వైసిపి మహిళా అద్యక్షురాలుగా షకిలా బేగం



**బుచ్చి ఫిబ్రవరి 14 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం వైసిపి మహిళా విభాగం అద్యక్షురాలుగా షేక్.షకిలాబేగంను అదిష్టానం నియమించారు. ఈ సందర్భంగా షకిలా బేగం మాట్లాడుతు తనపైన నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, జిల్లా అద్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డికి, వైసిపి రాష్ట్ర అధికారప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి, మండల కన్వీనర్లకు, నాయకులకు ,కార్యకర్తలకు ఆమె ప్రత్యేకం గా ధన్యవాదాలు తెలిపారు. పార్టీ బలోపేతానికి శక్తి వం చన లేకుండా కృషి చేస్తానని చెప్పారు.

## బుచ్చి ఫైర్‌స్టేషన్‌కి కోటి 47 లక్షలు మంజూరు - చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ



బుచ్చి ఫిబ్రవరి 14 ప్రభాతవార్త బుచ్చిరెడ్డి పాళెంలో ఫైర్ స్టేషన్‌కి కోటి 47 లక్షలు మంజూరు అయినట్లు చైర్‌పర్సన్ సుప్రజా మురళీ తెలిపారు. శుక్రవారం ఆమె స్ధానిక విలేఖర్లతో మాట్లాడుతు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు శాసనస భ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సహకారంతో ఈ ఫైర్‌స్టేషన్ మంజూరు కావడం జరిగిందని ఆమె చెప్పారు. మలిదేవి ఒడ్డున ఈ ఫైర్‌స్టేషన్ నిర్మాణం జరుగు తుందని చెప్పారు ఆమె ఎంపికి,ఎమ్మెల్యేకి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. అలాగే బిసి కార్పోరేషన్‌కి 15 వ తేది వరకు తేది పొడిగించడం జరిగిందని దీనిని అందరు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈకార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ పఠాన్ నస్రీన్, వైస్ చైర్మన్ యరపల్లి శివకుమార్‌రెడ్డి,కమీషనర్ చంద్రశేఖ ర్‌రెడ్డి,కౌన్సిలర్ రాచూరు సత్యనారాయణ ఉన్నారు.

## ముఖ్యమంత్రి కందుకూరు పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించిన స్పెషల్ ఆఫీసర్ సూర్యతేజ



నెల్లూరు కార్పొరేషన్,ఫిబ్రవరి 14, ప్రభాతవార్త: ప్రభుత్వ ఉత్తర్వుల మే రకు ప్రతి నెల మూడవ శనివారం "స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ ది వస్" లో భాగంగా కందుకూరు ని యోజ కవర్గం పరిధిలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొననున్న సందర్భాన్ని పురస్కరించుకొని కందు కూరు మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ యం.సూర్యతేజ శుక్రవారం ఏర్పాట్లను పర్య వేక్షించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పరిధిలో పలు కార్యక్రమాలకు సంబంధించిన ఏర్పా ట్లలో భాగంగా శానిటేషన్ పనులు, సివిల్ వర్క్స్, జంగల్ క్లియరెన్స్, ఇతర ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా స్థానిక ఏ.ఎమ్.సి మార్కెట్ యార్డు మైదానంలో నిర్వహించనున్న బహిరంగ సభలో ఏర్పాటు చేయనున్నస్టాల్స్,ఇతర ఏర్పాట్లపై నియమింపబడిన ప్రత్యేక అధికారులతో కమిషనర్ చర్చించి వివిధ సూచనలను జారీ చేశారు.స్థానిక దూబగుంట గ్రామం పరిధిలోని ప్రజాపార్కులో విద్యార్థులతో ముఖ్యమంత్రి మమేకమయ్యే సందర్భాన్ని పురస్కరించుకొని విద్యార్థులు తమలోని ప్రతిభను వెలికి తీసే విధంగా చేపట్టాల్సిన పెయింటింగ్స్, ఇతర కార్యక్రమాలను కమిషనర్ పర్యవేక్షించారు.